# గీత

## వేటూరి భాస్కరమ్మ

**గీ**త రోడ్డు మీద నడుస్తోంది.

అందమైన ఆమె ముఖంలో ఇప్పుడు విషాదం గూడుకట్టుకుని ఉంది. అందుకు కారణం ఆమెను భర్త వదిలిపెట్టాడు.

అది ఆమె స్వయం కృతాపరాధం. కారణం తెలుసుకోవాలంటే కొంతకాలం వెనక్కు నడవక తప్పదు.

OOO

**"గీ**తా! ఈరోజు కాలేజీ మానెయ్యి'' అంది అమల.

''ఎందుకని వదినా!'' ఆశ్చర్యంగా అమల ముఖంలోకి చూసింది గీత.

''ఏముంది కారణం వెరీ సింపుల్'' కొంటెగా మందహాసం చేస్తూ ఆడబిడ్డకేసి చూసింది అమల.

గీతకు కోపం హద్దులు దాటుతోంది. 'ఈవిడ ఎప్పుడూ ఇంతే. ఏదీ ఒక పట్టాన చెప్పదు. ఊరించి, ఊరించి ఆసక్తి పోయాక అప్పుడు చెబుతుంది.'

''ఇంతకూ విషయం ఏమిటో చెప్పనే లేదు'' రోషాన్ని అదిమిపెట్టి నెమ్మదిగానే అడిగింది.

''ఇప్పుడే చెప్పేస్తే థ్రిల్ ఉండదు.''

''అయితే సరే చెప్పకు'' విసురుగా జడ వెనక్కు వేసుకుని టేబుల్ మీదున్న బుక్స్ అందుకుంది గీత.

కథ ముదిరి పాకాన పడిందని గ్రహించింది అమల.

''కాస్తాగు గీతా! విషయం విను'' అంది కంగారుగా.

''ఇప్పుడు నాకంత ఓపిక లేదులే వదినా!'' అంటూనే వీధిగేటు తెరచి రోడ్డెక్కిందిగీత.

''గీతా! ప్లీజ్ నా మాట విను'' అంది అమల వెనుకే వెళ్ళి ప్రాధేయపడుతూ.

కాని గీత వెనక్కు తిరిగి చూడనైనా లేదు. అమల తనని తనే తిట్టుకుంది. గీత తత్వం తెలిసీ తను అలా చెయ్యడం తనదే తప్పు. ఇప్పుడో, కాస్సేపట్లోనో బజారు నుంచి వచ్చే భర్తకూ, అత్తగారికీ ఏమని చెబుతుంది?

ఆమె భయపడినంతా అయ్యింది.

''అమలా! గీతేదీ?'' ఆటో దిగగానే అడిగాడు రవి.

''కా.. కా... కాలేజీకి వెళ్ళింది'' తడబడుతూ చెప్పింది.

''ఏమిటి? కాలేజీకి వెళ్ళిందా? వాళ్ళొస్తారని నువ్వు చెప్పలేదా?''

''చెప్పేలోగా వెళ్ళిపోయింది'' అంది అమల.

కోడలి ముఖంలోకి అనుమానంగా చూసింది శారదమ్మ.

''అసలు ఈరోజు పెళ్ళి చూపులనే విషయం దానికి చెప్పావా?''

''లేదు'' భయంగా అంది.


''అవునమ్మా! నువ్వెందుకు చెబుతావులే. ఆడబడుచు నీ కంటే పైస్థాయిలోకి రావడం నువ్వు సహించలేవుగా. గీత నీ చెల్లెలిగా పుట్టకపోవడం దాని తప్పేలే'' అంది శారదమ్మ.

శారదమ్మ కోపానికీ అర్థం వుంది. గతంలో సీతకు చూడాలనుకొన్న ఒక సంబంధాన్ని తండ్రితో చెప్పి తన చెల్లెలుకే కుదిర్చేసింది. ఆ వరుడు ఢిల్లీలో మంచి జాబ్ చేస్తున్నాడు.

ఆ విషయం అత్తగారు మాటిమాటికీ దెప్పుతుంటే పౌరుషపడిన అమల తన స్నేహితురాలు వనజ తమ్ముడు శేఖర్ అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్ చేస్తుంటే అతనికి గీతని చేసుకోమని వనజకు మరీమరీ చెప్పింది.

వాళ్ళే ఆ రోజు రాబోయేది. శేఖర్‌కి శలవ్ లేదు. ఆ రోజు సాయంత్రమే వెళ్ళిపోవాలి.

అమల నిస్తేజంగా గదిలోకి నడిచింది. భర్తా,



అత్తగారూ తననీ జన్మకు క్షమించరు.

OOO

రవి కాలేజీకి వెళ్ళాడు స్కూటర్ మీద చెల్లెలి కోసం.

''గీతా! నా మాట విను. మీ వదిన సంగతి నీకు తెలీదా? ఈ రోజుకి శెలవు పెట్టేసి ఇంటికి రా. ఈ సరికి వాళ్ళొచ్చేసి ఉంటారు.''

''వద్దన్నయ్యా! అతనొక్కడే పెళ్ళి కొడుకు కాదు. ఆవిడ గారికి అంత పొగరెందుకు? విషయం ఏమిటో చెప్తే ఉండేదాన్నిగా'' అంటూ తమ మధ్య జరిగిన సంభాషణని పొల్లుపోకుండా ఏకరువు పెట్టింది గీత.

''ఆ విషయం మరిచిపోమని చెప్తున్నానుగా. ఇలాంటప్పుడు పంతాలకు పోవడం మంచిది కాదు.''

''ఆ శ్రీరంగ నీతులేవో ముందు మీ ఆవిడకు చెప్పు'' అంది గీత క్లాసు రూమ్‌కేసి నడుస్తూ.

నిస్సహాయంగా ఆమెకేసి చూస్తూండిపోయాడు రవి. అతను ఇంటికి తిరిగి వెళ్ళేసరికి పెళ్ళి వారు రావటం, వెళ్ళటం కూడా అయిపోయింది.

'పెళ్ళి చూపులకు కూడా ఇంటి పట్టున ఉండని పిల్ల మాకక్కర్లేదు' అంది శేఖర్ తల్లి సుందరమ్మ అమల ఇచ్చిన గీత ఫోటోని చూడకుండానే ఇచ్చేస్తూ.

''కాదండీ! అసలు తప్పంతా నాదే'' అంటూ జరిగినదంతా చెప్పింది అమల.

''నిజమేననుకో కాని, నువ్వు అంతగా చెప్పిన తర్వాత కూడా వినని అమ్మాయి రేపు పెళ్ళయ్యాక మొగుడి మాట వింటుందని గ్యారంటీ ఏమిటి?'' అంది సుందరమ్మ నిరసనగా.

''మీరైనా కాస్త అమ్మాయి ఫోటో చూడండి. మీకు నచ్చితే ...'' అంది అమల శేఖర్‌తో.

''నచ్చటం, నచ్చక పోవడం తరువాత మాటండీ'' అన్నాడు శేఖర్.

అమల మౌనం వహించింది. శారదమ్మ కాఫీ ట్రేతో వచ్చింది. అయితే వాళ్ళు తీసుకోలేదు.

''ఊరికే త్రాగటం మాకు బావుండదు'' అన్నాడు శేఖర్.

''వనజా! నువ్వయినా చెప్పు'' అంది అమల స్నేహితురాలికేసి చూస్తూ.

''ఇలాంటి విషయాల్లో ఎవరి మీదా మన అభిప్రాయాలు రుద్దకూడదు అమలా! జరిగినదంతా మర్చిపో'' అనేసింది వనజ.

సమయానికి ఇంటి దగ్గర ఉండకుండా వెళ్ళిపోయిన భర్తమీద కోపం ముంచుకొచ్చింది అమలకు.

మొత్తానికి ఆ సంబంధం కాన్సిలైంది.



OOO

గీత డిగ్రీ పూర్తి చేసిన వెంటనే పెళ్ళి కుదిరింది. వరుడు విశ్వం బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అతనూ, తల్లీ తండ్రీ, చెల్లెలూ అంతే. గీత అయిదో మెంబరుగా ఆ ఇంట్లో అడుగు పెట్టింది.

''అమ్మనూ, నాన్ననూ, చెల్లాయినీ కూడా మనతో ఉంచుకుందాం గీతా! ఆ పల్లెలో వాళ్ళెందుకు?'' అన్నాడు విశ్వం భార్యను ప్రాధేయపడుతున్నట్టుగా.

గీతకదే నచ్చదు. మరీ అంత మెతకగా ఉంటారేం. తనతో చెప్పనంత మాత్రాన కొంపేం మునిగిపోయిందని ... తను వద్దంటే ఏం చేస్తారో చూడాలన్పించిందామెకు.

''వద్దు'' అంది కాఠిన్యాన్ని కొని తెచ్చుకుని.

విశ్వం మరి మాట్లాడలేదు. 'ఎందుకు వద్దు నా వాళ్ళు. నా ఇష్టం' అంటాడేమోనని ఎదురు చూసింది. కాని అతననలేదు. మొత్తానికి విశ్వం, గీత ఇద్దరే ప్రయాణమయ్యారు.

''డిగ్రీ చేశానుగా ఊరికే కూర్చోటమెందుకు? ఏదైనా జాబ్ చేస్తాను'' అంది గీత ఒక రోజు.

విశ్వం ఆమెకేసి ఇబ్బందిగా చూశాడు. అతనికి భార్య ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు. తను వచ్చే సరికి పని పూర్తి చేసుకుని ఫ్రెష్‌గా తయారై తన క్కావాల్సినవి చూస్తుంటే హాయిగా ఉంటుంది




కాని, ఇద్దరూ ఆఫీసుల్లో పనితో అలసిపోయి ఇంటి కొచ్చి గీత పని చేసుకోలేక సతమతమై పోతుంటే తను చూస్తూ ఉండలేడు. అలాగని పనిలో సాయం చెయ్యనూ లేడు. కానీ తన అభిప్రాయాన్ని నిస్సం కోచంగా బయట పెట్టాలంటే జంకు.

''రేపే అప్లికేషన్స్ పెడతాను'' అంది గీత అతను వద్దంటాడేమోనని ఆశగా చూస్తూ.

కాని విశ్వం వద్దనలేదు.

గీత ఉద్యోగంలో చేరింది. ఉదయమే లేచి ఎవరో తరుముకొస్తున్నట్టు వంట పూర్తి చేసి భర్తకు పెట్టి తను తిని కాస్త అన్నం డబ్బాల్లో సర్దుకుని తయారై గుమ్మం దిగేసరికి పది గంటలు దాటు తుంది.

వెంటనే బస్ దొరికితే టైమ్‌కే చేరుకుంటుంది. లేకపోతే లేటే.

ООО

**కా**లగర్భంలో మూడేళ్ళు గడిచిపోయినై. గీతకూ, విశ్వానికీ రోజులు యాంత్రికంగా గడిచిపో తున్నాయి. మార్పేదైనా ఉంటే వాళ్ళిద్దరూ ఒక బాబుకి జన్మనివ్వడమే.

''నేను ఆపరేషన్ చేయించుకుంటాను'' అంది గీత ఒక రోజు. విశ్వం ఆమెకేసి ఆశ్చర్యంగా చూశాడు. ఒక్క బిడ్డ చాలనుకుంటోందా?

మళ్ళీ చెప్పింది గీత.

''నీ ఇష్టం'' అన్నాడు విశ్వం నిర్లిప్తంగా.

''మీ కిష్టం కాదా?''

''నీ ఇష్టమే నా ఇష్టం''.

భర్తకేసి అసహనంగా చూసి అక్కడి నుంచి వెళ్ళిపోయిందామె. బాబుని చూసుకోవటానికి పని పిల్లని మాట్లాడింది గీత. ఇప్పుడామెకు రిలీఫ్‌గా ఉంది. బాబుని చూట్టమేకాక ఇంట్లో వంట కూడా చేస్తోంది లక్ష్మి.

తీరిక చిక్కడంతో లేడీస్ క్లబ్‌లో మెంబరుషిప్ తీసుకుంది గీత. ఆఫీసు నుంచి రాగానే చక్కగా ముస్తాబై క్లబ్‌కి వెళ్ళిపోతుంది. రాత్రి ఏ తొమ్మిదికో ఇంటికొచ్చి భోజనం చేసి అలసటగా పడకమీద వాలిపోయే భార్యకేసి బాధగా చూస్తాడు విశ్వం. సాయంత్రాలు సరదాగా ఎటైనా వెళ్ళాలనీ, లేకపోతే గార్డెన్‌లో కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవాలనీ ఉంటుందతడికి. కాని ఆ విషయం చెప్పాలంటే సంకోచం.

ఆ రోజు పల్లె నుంచి ఉత్తరం వచ్చింది. విశ్వం చెల్లెలు రాధకు పెళ్ళి కుదిరిందట. ఇంక పది రోజుల్లో ముహూర్తం. వెంటనే బయలుదేరి రమ్మని రాశారు.

''నాకెలా కుదుర్తుంది? ఆ రోజు క్లబ్ యాని వర్సరీ. అసలు మిమ్మల్ని కూడా రమ్మందాం అను కున్నాను. మేడ్ ఫర్ ఈచ్ అదర్ ప్రోగ్రాం ఉంది'' అంది గీత.

మొదటిసారిగా భార్యమీద అసహ్యం వేసింది విశ్వానికి. కాని అతి ప్రయత్నం మీద అదిమి పెట్టు కున్నాడు.

''కావాలంటే మీరు ముందుగా వెళ్ళండి. నేను పెళ్ళి టైమ్‌కి వస్తాను.''

''నువ్వు రాకపోయినా పెళ్ళేం ఆగిపోదులే'' అన్నాడు విశ్వం.

ООО

**ము**హూర్తానికి గీత పెళ్ళికి వెళ్ళనేలేదు. 'ఆ సమ యానికి క్లబ్ యానివర్సరీ ప్రోగ్రామ్స్ ఉన్నాయనీ రావటానికి వీలుపడదనీ' టెలిగ్రాం ఇచ్చింది.

భర్త ఖచ్చితంగా రావాలని పట్టుబట్టి ఉంటే వెళ్ళాలనే అనుకుంది. కాని కథ మామూలే. ఏ విషయంలోనూ ఆమె మాటకు ఎదురు చెప్పడు విశ్వం.

ఆడబడుచు పెళ్ళికి వదిన గారు రాకపోవటం ఆ పల్లెటూళ్ళో అందరికీ చర్చనీయాంశం అయింది. భార్యను అదుపాజ్ఞల్లో ఉంచుకోలేని అస మర్థుడిగా విశ్వం మీద ముద్రపడిపోయింది.

ООО

**తి**రిగి వచ్చిన దగ్గర నుంచి విశ్వంలో వచ్చిన మార్పుని చూసి గీత ఆనంద పడింది. కనీసం ఇప్పు డైనా అతను తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తాడో, తనను శాశిస్తాడనీ అనుకొంది. కాని ఆమె అంచనాకి విరు ద్ధంగా విశ్వం ఆమెతో మాట్లాడడం మానేశాడు.

గీతకు రోషం వచ్చింది. 'తనేం తప్పు చేసిం దని. ఇలా చెయ్యి' అని అతను పట్టుబడితే చెయ్య కుండా ఉండేదా? ఆ విషయం గుర్తించడేం? తనూ భర్తతో మాటలు ఆపేసింది. ఇప్పుడు ఇద్దరూ లోకం దృష్టిలో మాత్రమే భార్యాభర్తలు. నిజానికి ఆ సంబంధం వాళ్ళ మధ్య లేదు.


బాబుకు ఏడాది వెళ్ళింది. తప్పటడుగులు వేస్తూ ఇల్లంతా తిరుగుతున్నాడు. ముద్దు మాట లతో అందర్నీ అలరిస్తున్నాడు కాని తల్లికి మాత్రం ఎప్పుడూ ముద్దురాడు. ఎప్పుడైనా దగ్గరకు వెడితే కసరి 'అమ్మ' అంటేనే ఆ పసివాడికి దడ పుట్టేలా చేసేస్తుంది. భర్త మీద కోపం కొడుకు మీద చూపు తుంది.

బాబుని చూస్తే విశ్వానికి జాలి వేస్తుంది. తన మీద కోపం వాడిమీద చూపిస్తుంటే వేదనతో అల్లాడి పోతాడతను. ఒక్కోసారి వాడి కోసం భార్యను ప్రాధేయపడితే - అనిపిస్తుంది. కాని పౌరుషం అడ్డొ స్తుంది. ఏం తనకు మాత్రం తెలీదా తల్లిగా తను పోషించాల్సిన బాధ్యతలేమిటో.

బాబుని పల్లెలో ఉన్న తన వాళ్ళ దగ్గరకు పంపించెయ్యాలని ఎన్నోసార్లు అనుకున్నాడు విశ్వం. కాని ఇప్పటికే తను అసమర్థుడిగా పేరుపడ్డాడు. అలా చేస్తే ఇక తను తలెత్తుకోగలడా. అసలు గీత ఒప్పుకుంటుందా? అందుకే ఆ ఆలోచనకు స్వస్తి చెప్పాడు.

ООО

**ఆ** రోజు లక్ష్మికి జ్వరం వచ్చింది. అంతకు




నాలుగు రోజుల ముందే గీత మహిళా మండలి మీటింగ్ అని విజయవాడ వెళ్ళింది.

విశ్వం డాక్టర్ని తీసుకొచ్చి లక్ష్మిని చూపించాడు. ఇంజక్షన్ ఇచ్చి మామూలు జ్వరమే కంగారు లేదని టాబ్లెట్స్ వ్రాసిచ్చాడు డాక్టర్. వాటిని కొని తెచ్చి లక్ష్మికి ఇచ్చి జాగ్రత్తలు చెప్పాడు విశ్వం. ''ఈ రోజుకు నేను హోటల్లో తినేస్తానులే'' అన్నాడు.

లక్ష్మి తల ఊపింది.

''బాబు నిన్ను విసిగిస్తాడేమో?''

''ఏమీ ఫర్వాలేదు. అంతా బాగానే ఉంటుంది. నేను చూసుకుంటాను'' అంది లక్ష్మి.

విశ్వం బాబు నెత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. ''ఆంటీని అల్లరి పెట్టకు. బుద్ధిగా ఉండు. లేకపోతే కొడతా'' అన్నాడు బెదిరిస్తూ.

బాబు తల ఊపాడు. ''బుద్ధిగా ఉంతా'' అన్నాడు ముద్దుగా.

''నేను వేగం వచ్చేస్తాలే నీకు బిస్కెట్లు తెస్తా'' అన్నాడు విశ్వం వాణ్ణి దింపి.

''వెడుతున్నా లక్ష్మీ! బాబు జాగ్రత్త'' అని మరోసారి లక్ష్మికి చెప్పి బ్యాంక్కు వెళ్ళిపోయాడు విశ్వం. బ్యాంకులో ఇన్స్పెక్షన్ జరుగుతోంది. లేకపోతే లీవ్ పెట్టి ఉండిపోయేవాడే.

''బాబూ! ఎక్కడకూ వెళ్ళకు. ఇక్కడే ఆడుకో'' అంది లక్ష్మి కళ్ళు మూసుకుని అటు ప్రక్కకు తిరిగి పడుకుంటూ.

''ఇక్కడే ఆలుకుంతా నాంటీ'' అన్నాడు బాబు.

అయిదు నిమిషాల్లో నిద్ర పట్టేసింది లక్ష్మికి. ఆమెకేసి చూసి బాబు సంతోషంగా నవ్వుకున్నాడు. 'భలే భలే అక్కడికెళ్ళకు ఇక్కడికెళ్ళకు అని అడ్డుకునే రాక్షసి ఆంటీకి బాగా జరిగింది' అనే భావం ఉందా నవ్వులో.

మరుక్షణంలో పంజరంలోంచి బయటపడ్డ పక్షిలా పెరట్లోకి పరుగెత్తాడు.

OOO

''విశ్వం! నీకు ఫోన్ వచ్చిందోయ్'' అన్న ఆఫీసర్ కేసి ఆశ్చర్యంగా చూశాడు విశ్వం.

''తనకు బ్యాంక్కి ఫోన్ చేసే వారెవరు? గీత ఊర్నుండి వచ్చేసిందా? వచ్చినా ఆమె తనకు ఫోనెందుకు చేస్తుంది?'

''హలో నేను విశ్వాన్ని. మీరెవరు?''

''బాబూ విశ్వం! నేను పరంధామయ్యని'' కంగారుగా ఉంది అతని కంఠం. అతను విశ్వం పక్కింట్లోనే ఉంటున్నాడు.

''మీరా అంకుల్! లక్ష్మి ఎలా ఉంది ప్రమాదం లేదుకదా.''

''ఆమెకేం బాబూ! బాగానే ఉంది కాని...''

''ఊఁ కాని...?''

''ఎలా చెప్పను విశ్వం! ఈ దుర్వార్త నీకు చెప్పటానికి నోరాడట లేదు బాబూ!''

''చెప్పండంకుల్! ఏం జరిగింది?''

''బాబు నీటి కుండీలో పడి చచ్చిపోయాడు బాబూ!''

OOO

గీత తిరిగొచ్చింది. పరంధామయ్య గారిచ్చిన తాళం చెవితో తలుపు తీసింది నేలమీద పడుందో ఇన్లాండ్ కవరు.

గీతా!

నీకు ఎప్పుడూ లెటర్ రాయలేదు. ఇప్పుడు రాయక తప్పని పరిస్థితి. మనమిద్దరం ఎన్నటికీ కలుసుకోని రైలు పట్టాల వంటివాళ్ళం. ఒకింట్లో బ్రతక లేమని తెలిసీ బాబుకోసం ఎప్పటికప్పుడు రాజీపడి పోయాను. వాడికి తల్లిని దూరం చెయ్య కూడదనే. ఆ అభిప్రాయమే వాడిని బలిగొంది.

'గీతా వెళ్ళకు బాబుని చూసుకో నాకు ఇన్స్పెక్షన్ ఉంది' అని చెప్పాలనిపించింది. కాని లక్ష్మికి చెప్పి నాకు చెప్పని నీ అహంకారాన్ని చూశాక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

సరే నువ్వెళ్ళి పోయావు. లక్ష్మికి జ్వరం వచ్చింది. నాకు బ్యాంకులో వెళ్ళక తప్పని పరిస్థితి. అక్కడకూ లక్ష్మికి అన్ని జాగ్రత్తలూ చెప్పే వెళ్ళాను. కాని తల్లికే అక్కర్లేని వాడి గురించి ఇతరులు ఎందుకు పట్టించుకుంటారు?

లక్ష్మి నిద్ర పోతుండగా బయటకొచ్చిన వాడిని నీళ్ళకుండీ మృత్యు గహ్వారమై ఆహ్వానించింది. ఆనందంగా ఆ కౌగిట్లోకి వెళ్ళిపోయాడు. మనిద్దరి మధ్యా ఉండే ఒకే ఒక బంధం తెగిపోయింది. ఇక మనిద్దరం కలిసి ఉండటం అసంభవం. అందుకే నేను నీకు అడ్డుగా ఉండడానికి ఇష్టపడక తొలగిపోతున్నాను.

నువ్వు ఉద్యోగమే చేస్తావో, మహిళా లోకాన్నే ఉద్ధరిస్తావో నాకు అనవసరం. మనమిద్దరం కోర్టు ద్వారా విడిపోవడానికి నాకు అభ్యంతరం లేదని చెప్పడానికే ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఇక శలవ్. నీకు ఏమీ కాని విశ్వం

గీత చేతిలో నుండి ఉత్తరం జారిపడింది.

OOO

గీత మరబొమ్మలా నడిచి నడిచి ఒక ఇంటి ముందు ఆగింది. చీర కొంగుతో కళ్ళు తుడుచుకుని బ్యాగ్లోంచి తాళం చెవి తీసి తలుపులు తెరిచింది. అది ఆమె దినచర్య. తలుపు తీయగానే బాబు నెత్తుకుని భర్త ప్రక్కగా నిలబడి ఉన్న తన ప్రతిరూపాన్ని ఫోటోలో చూసుకుని నిట్టూర్పు విడుస్తుంది. అదీ ఆమె దినచర్యే. ఇది ఒక్క గీత కథే కాదు. అవసరమైన పంతాలకు పోయి స్వర్గతుల్యమైన సంసారాలను నాశనం చేసుకొనే ఎందరో పడతుల నుదుటి రాత కూడా.